## శంకరేశ్వరస్వామికి ఘనంగా పూజలు

అగళి, ఆగస్టు 27 ప్రభాతవార్త



శంకరేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం, హాజరైన భక్తులు.. జడ్పిటిసి

మండల కేంద్రమైన అగళి పురాతన శంకరేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని ఘనంగా పూజలను, వేడుకలను నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను, ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామిని అలంకరించారు. దేవాలయం ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు శంకరేశ్వరస్వామి పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. మహిళా భక్తులు దేవాలయంలో దీపాలను వెలిగించారు. మహామంగళ హారతి, పంచామృతాభిషేకం అనంతరం ఆలయ మండలి వారు భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

అగళి, ఆగస్టు 27 ప్రభాతవార్త

కిడ్నీ దెబ్బతిన్న రోగులు డయాలసిస్ చేయించుకోవాలంటే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలి. అగళి మండలంతోపాటు అమరాపురం మండలం జిల్లా కేంద్రం శ్రీ సత్యసాయికి, ఇటు హిందూపురంకి సదూరంలో ఉంది. డయాలసిస్ పేషంట్లు ప్రతివారం డయాలసిస్ చేయించుకోవాలంటే పుట్టపర్తి ప్రభుత్వాసుపత్రికికానీ, హిందూపురంప్రభుత్వాసుపత్రికికానీ వెళ్లాల్సిన పరిస్థితి. ఇది ఎంతో వ్యయ ప్రయాసాలకు కూర్చిన పని. అందుకే నియోజకవర్గ పరిధిలోని డయాలసిస్ పేషంట్లు, డయాలసిస్ కేంద్రాన్ని మడకశిరలో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. ఆ దిశగా ఆలోచించి జిల్లా ఎన్నికల అధికారులు చొరవ తీసుకుని డయాలసిస్ కేంద్రాన్ని మడకశిరలో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

## వైసీపీని వీడి టిడిపిలోకి చేరికలు..!

మడకశిర టౌన్, ఆగస్టు 27 ప్రభాతవార్త



వైసిపి పార్టీ నాయకులకు పసుపు కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ప్రజలకు అండగా ఉంటూ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైసీపీ వీడి టిడిపిలో చేరారు. మండల పరిధిలోని అచ్చంపల్లి గ్రామానికి చెందిన రామాంజప్ప, రామకృష్ణ, నాగరాజు, బొజ్జప్ప, మంజునాథ్, అశ్వర్థప్ప సురేష్‌బాబు, టిడిపి పార్టీలో చేరారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపిలో చేరే ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వైసీపీ నుంచి 12 కుటుంబాలు టిడిపిలో చేరారు. టిడిపి పార్టీలోకి వచ్చిన వారు మాట్లాడుతూ.. టిడిపి విధానాల పట్ల ఆకర్సితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బిసి, మైనార్టీ ఎస్సీ, ఎస్టీ అన్ని వర్గాల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు మనోహర్ కిష్టప్ప, అచ్చంపల్లి టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

## సిఐ మనోహర్‌ను ఘనంగా సన్మానించిన వాల్మీకులు

మడకశిర ఆగష్టు 27 ప్రభాతవార్త;



సిఐ మనోహర్‌ను సన్మానిస్తున్న వాల్మీకులు

పట్టణంలోని అమరాపురం బస్టాండ్ నందు వెలసిన శ్రీఒడిసిలమ్మ దేవాలయ ఆవరణంలో సిఐ మనోహర్‌ను మంగళవారం వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదలీపై వెళుతున్న సిఐ మనోహర్‌ను వాల్మీకి కులస్థులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. వాల్మీకిసేవాసంఘం ఆధ్వర్యంలో ఒడిసిలమ్మ ఆమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి సిఐమనోహర్ పేరుమీద ప్రత్యేకంగా పూజలను జరిపించారు. అనంతరం వాల్మీకులు మాట్లాడుతూ సిఐ మనోహర్ ఎంతో విలువలతోకూడిన విధంగా విధులునిర్వహించారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులను చాలా సున్నితంగా పరిష్కరించే వారని అతని సేవలను కొనియాడారు. మీరు ముమ్ముందు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు మోహన్‌కుమార్, రవీంద్రనాథ్, బేగార్లపల్లినాగరాజు, కుళ్లాయప్ప, ఓబులేషు, మాధవరాజు, పుట్టకామప్ప, జోగప్ప, నాగరాజు, వాల్మీకిగంగాధర్. కిష్టప్ప, ప్రభాకర్, శ్రీనివాసులు, రాధాకృష్ణ, రమేష్, గోపాల్, వెంకటేష్, మణూరు వెంకటేష్, డీలర్ సోము, శివానంద, తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో వివిధ వార్డుల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు

-దగ్గరుండి పర్యవేక్షించిన పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త



పట్టణంలోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ దృశ్యాలు



పట్టణంలోని వివిధ వార్డుల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు విస్తృతంగా కొనసాగాయి. ప్రధాన రోడ్లలో చెత్తా చెదారంతోపాటు బీటీ, సీసీ రోడ్లపై పేరుకుపోయిన మట్టిను, రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించగా పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచి ప్రజలు రోగాలబారిన పడకుండా చర్యలు తీసుకొంటున్నామని ప్రజలు చెత్తాచెదారాన్ని రోడ్లపై కాకుండా చెత్త కుండీలు, నిర్దేశిత ప్రాంతాల్లోనో, పారిశుద్ధ్య రిక్షాల్లో పారబోయాలని కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ అన్నారు.

## తుమ్మల మారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

గుడిబండ, ఆగస్టు 27 ప్రభాతవార్త



గుడిబండ మండలంలోని గ్రామ శివారులో వెలసిన శ్రీ తుమ్మల మారమ్మ దేవాలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుండి బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు

-నేటి సాయంత్రం మొదలు కానున్న గంధం ఊరేగింపు

-విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతున్న దర్గా

-ప్రత్యేక ఆకర్షణగా ఎల్ఈడీ విద్యుత్ దీపాల స్వాగత తోరణాలు



విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతున్న బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గా

ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహావారి దర్గా ఉరుసు ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ఇందుకు కోసం దర్గాను రంగు రంగుల ఎల్ఈడీ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్ మొదలు దర్గా వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల స్వాగత తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నేడు 'గంధం' వేడుకలు జరుగనున్నాయి. రాత్రి కీ॥శే॥అల్లపరెడ్డి ఇంటి నుండి గంధం ఊరేగింపు బయలుదేరి కీ॥శే॥టి.హుసేన్‌పీరా ఇంటివద్ద చేప దేవుడి గుడి నుండి పట్టణ వీధుల గుండా దర్గా చేరనుంది. 29న గురువారం 'ఉరుసు' కార్యక్రమం జరుగనుండగా పామిడి బాషుసాబ్ అంగడి నుండి షంషేరు శుభ్రపరిచి రాయదుర్గం బుడెన్‌సాబ్ ఇంటి నుండి రాత్రి 12 గంటలకు షంషేరు పురవీధుల గుండా దర్గాకు చేరుతుంది. 30న తేదిన శుక్రవారం జియారత్ సందర్భంగా స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయం నుండి అమ్మవారికి సమర్పించేందుకుగాను చాదర్ ఊరేగింపు, రాత్రి జియారత్ ముగింపు జరుగనుంది. ఉరుసు, జియారత్ రోజుల్లో రాత్రి దర్గా ఆవరణంలో గొప్ప ఖవ్వాలి పోటీలు జరుగుతాయని ఆ రెండు రోజుల్లో మధ్యాన్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం ఉంటుందని దర్గా కమిటీ తెలిపింది.

## పంట నమోదును పరిశీలించిన తహాశీల్దార్

గుంతకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త



పంట నమోదును పరిశీలిస్తున్న తహాశీల్దార్ రమాదేవి

మండలంలోని ఎన్. తిమ్మాపురం గ్రామంలో మంగళవారం తహాశీల్దార్ రమాదేవి, మండల వ్యవసాయాధికారి స్వాతితో కలిసి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు వ్యవసాయ సిబ్బందికి వివరాలు తెలియచేయాలని సూచించారు. పంట నమోదులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటలు సాగుచేయని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి స్వాతి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అందచేసి నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ శివ, విఎఎ రాజా, ఎంపిఇఒ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవివేకానందపాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గుంతకలు, ఆగస్టు 27 ప్రభాతవార్త



శ్రీకృష్ణ, గోపికల వేషదారణలో విద్యార్థులు

పట్టణంలోని శ్రీవివేకానంద పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గురుదాస్, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి శ్రీకృష్ణుని జీవిత ఘట్టాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఇఒ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సరోజమ్మ, గోపాలుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పునఃప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకటనాయక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాలలో పట్టణ కార్యదర్శి అఖిల్ అధ్యక్షతన విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**కళాశాల నూతన కమిటీ ఎన్నిక :** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గణేష్, షెక్షావలితో పాటు కార్యవర్గసభ్యులుగా 20 మందిని కమిటీ సభ్యులుగా 50 మందిని ఎన్నుకోవడం జరిగింది.

## 80 శాతం రాయితీతో రైతులకు ఉలువలు

-రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

-ఉరవకొండ మండల వ్యవసాయాధికారి జి.శుభకర్

ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఏవో జి.శుభకర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 80శాతం రాయితీతో ఉలువలను పంపిణీ చేయనుందని అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లించి విత్తనాలను పొందాలని మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఖరీఫ్-2024లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా అనేకమంది రైతులు పొలాలను ఖాళీగా పెట్టుకున్నారని ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించగా రైతులు ప్రత్యామ్నాయంగా విత్తుకోవడానికిగాను ఉలువలను అందిస్తోందన్నారు. ఉలువలు పూర్తి ధర క్వింటాల్ 8,700 రూపాయలు కాగా 80శాతం రాయితీపోను రైతులు కేవలం 1,740 రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక ఎకరా లోపల భూమి ఉన్న రైతులకు ఒక బ్యాగు (10 కేజీలు), ఎకరంపైన భూమి ఉన్న వారికి రెండు బ్యాగులు, రెండు ఎకరాలపైన భూమి ఉన్న వారికి మూడు బ్యాగుల చొప్పున ఉలువలను అందించడం జరుగుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట కచ్చితంగా వేస్తామని ప్రమాణ పత్రాన్ని సమర్పించి విత్తనాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా విత్తనాలు తీసుకొని పక్కదారి పట్టించాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏవో స్పష్టం చేశారు.

## శ్రీమారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబైన ఆలయం

-మాతృమూర్తి జ్ఞాపకార్థం ఆలయం నిర్మించిన రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ -నేడు విగ్రహప్రతిష్ఠకు హాజరు కానున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

విడపకనల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త



ప్రతిష్ఠించనున్న శ్రీమారెమ్మతల్లి విగ్రహం

మండలంలోని గడేకల్లు గ్రామంలో కొలువైన శ్రీమారెమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణం పూర్తికావడంతో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్య కుమార్‌యాదవ్ మాతృమూర్తి జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా గత రెండు రోజుల నుండి హోమంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోదరులు నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే శ్రీమారెమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ హాజరు కానున్నట్లు స్థానిక బిజెపి నాయకులు తెలిపారు. మొదటి సారిగా సొంత గ్రామానికి మంత్రి వస్తుండడంతో స్థానిక బిజెపి నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీమారెమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు, భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## కస్తూరిబాగాంధీ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ

విడపనకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త



ఫ్యాన్లు అందచేస్తున్న దృశ్యం

మండలంలోని మళాపురం గ్రామంలో వున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ మంగళవారం 10 సీలింగ్ ఫ్యాన్లను వితరణచేశారు. ఇక ముందు కూడా పాఠశాల అభివృద్ధికోసం తమవంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని సూచించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసిప్రియ, గ్రామపెద్దలు రాజా, ప్రసాద్‌రావు, వన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

అమరాపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త



మాట్లాడుతున్న దృశ్యం

మండలంలోని హాలుకూరు గ్రామం వద్ద వున్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఆర్డీటి, మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం - బాలికలను చదవనిద్దాం అనే కార్యక్రమాన్ని ఆర్డీటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుడిబండ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ అధికారిణి పద్మావతి, ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, కళాశాల ప్రిన్సిపాల్ ఓబులపతిలు హాజరయ్యారు. సిడిపిఒ మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, మంచి ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా వుంటూ ఆత్మస్థైర్యంతో వుండాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలు శారీరక, మానసిక ఒత్తిడికి గురికారాదన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాల తరువాత వివాహాలు చేయాలన్నారు. అలా కాకుండా బాల్య వివాహాలు చేస్తే బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహం చేసుకున్నా, నిర్వహించినా, సహకరించిన శిక్షార్హులన్నారు. ఇందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా లేదా రెండు విధించడం జరుగుతుందన్నారు. లైంగిక నేరాల నుండి బాలలకు రక్షణ చట్టం 2012 కూడా వర్తిస్తుందని తెలిపారు. బాల్య వివాహాలపై 1098, 100, 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీటి మల్లికార్జున మాట్లాడుతూ ఆర్డీటి సంస్థ ప్రతి మండలంలో ప్రభుత్వశాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందస్తు చర్యగా గ్రామస్థాయిలో, పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ముఖ్యంగా బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ వల్ల కలిగే అనర్థాలను లఘు చిత్రాల ద్వారా తల్లిదండ్రులు, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అమ్మాయిలు చదువు మీద దృష్టి పెట్టి బాగా చదువుకుని తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి ఏరియా లీడర్ మీనాక్షి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు లక్ష్మీదేవి, కల్పన, రత్నమ్మ, గీత, చిన్నారులు పాల్గొన్నారు.

## ఆలదపల్లిలో తీరిన తాగునీటి ఎద్దడి

-కృతజ్ఞతలు తెలిపిన తాలూకా బిసి సెల్ ఉపాధ్యక్షులు మంజుతారక్

అమరాపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త



బోర్ వేస్తున్న దృశ్యం

మండలంలోని ఆలదపల్లి గ్రామం లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామిల దృష్టికి తాలూకా బిసి సెల్ ఉపాధ్యక్షులు మంజుతారక్ తీసుకెళ్లారు. స్పందించి న వారు అధికారులతో మాట్లాడి వేర్ వేయడం ద్వారా నీరు సమృద్ధిగా పడడంతో సమస్య తీరింది. మండల పరిషత్ నిధుల కింద తాగునీటి ఎద్దడి నివారణ కోసం బోర్ వేయడం జరిగిందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సికి మంజుతారక్ కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అమరాపురం, ఆగస్టు 27 ప్రభాతతవార్త



శ్రీకృష్ణుని ప్రతిష్టాపన దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం దక్షిణ గొల్లహట్టి, తమ్మడేపల్లి, వలస గ్రామాల్లో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, తోటదహళ్లి, ఈరన్నస్వామి, జుంజప్పస్వామి దేవాలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను మంగళవారం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళ్యాణోత్సవం, ఉయ్యాల సేవ నిర్వహించారు. 23న స్వామివారి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవసంఘం సభ్యులు రాధాకృష్ణ, శివలింగప్ప, జి.శివన్న, నాగభూషణ్, చిన్న భూతరాజు, రంగప్ప, భూతరాజు, ఈరన్న, భూతరాజు, పవన్‌కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ధర్మవరం, ఆగస్టు 27 ప్రభాతవార్త



కృష్ణుడు, గొల్లభామల వేషధారణలో చిన్నారులు

పట్టణంలోని యాధవ వీధి, లోనికోట, బ్రాహ్మణ వీధి తదితర ప్రాంతాలలో శ్రీ వెన్నముద్దల శ్రీకృష్ణుడి ఆలయాలలో ఈ నెల 26, 27 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, ఆలయ పాలక మండలి నాయకులు,ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి రోజు ఆలయంలో శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాలకి అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు సత్యనారాయణ, వారి శిష్యబృందం అభిషేకాలు, పూజ వేడుకలను భక్తాదులు నడుమ నిర్వహించారు. అనంతరం రుక్మిణి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా సాంప్రదాయ పద్దతిలో అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు.

## ఘనంగా జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్ జన్మదిన వేడుకలు

గుడిబండ, ఆగస్టు 27 ప్రభాతవార్త



దుర్గేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి వనజ శశిధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు మ ఆరుతి, రమేష్, హనుమంతు, అజ్జర్, లోకేష్, జనార్ధన్, వెంకటరమణ పాల్గొని దుర్గేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి దుర్గేష్ చేసిన సేవలను కొనియాడారు.

## మద్యం మత్తులో గాయపడ్డ బుగ్గపల్లి వాసి మృతి

గోరంట్ల, ఆగస్టు 27 ప్రభాతవార్త



మృతి చెందిన సూరప్ప

పట్టణ సమీపంలోని పులేరు రోడ్లు ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఈ నెల 14న మద్యం మత్తులో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం అనంతపురంలో పుట్టపర్తి మండలం బుగ్గపల్లి గ్రామానికి చెందిన సూరప్ప (43) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సూరప్ప తన భార్య పిల్లలతో కలిసి గోరంట్ల పట్టణంలోని హరిజనవాడలో కొంతకాలంగా నివాసం వుంటున్నారు. ఈ నెల 14న సూరప్ప పట్టణ చివర మద్యం మత్తులో పడిపోయి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వివిధ చోట్ల చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కొసం అనంతపురంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సర్కార్ స్టూడెంట్స్‌కు..ఉచిత కంటి వైద్యం

-గోరంట్లలోని ఉగ్రారంపల్లిలో..ఆరోమా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ బొగ్గు సురేష్ నేతృత్వంలో శిబిరం

గోరంట్ల, ఆగస్టు 27 ప్రభాతవార్త



కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని వానవోలు పంచాయతీ పరిధిలోని ఉగ్రారంపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్పేస్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని ఆరోమా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ బొగ్గు సురేష్ నేతృత్వంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి, చెవి పరీక్షలను విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఐ డ్రాప్స్ అందచేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి సర్కిల్‌లోని అల్ట్రామిషన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొగ్గు సురేష్, డాక్టర్ ప్రవల్లిక, సుధాకర్, లిఖిత, సాయిమోహన్, అమృత వర్షిణి, దేవరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేష్, ఉపాధ్యాయులు ఆయిషా, పిల్లలు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర డివిఎంసీ కమిటీ ఎన్నిక

తనకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త



రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి గంగులయ్య



ప్రధానకార్యదర్శి ఆరుద్ర శ్రీనివాసులు

రాష్ట్ర డివిఎంసి ఎన్నిక మంగళవారం విజయవాడలో ఏకగ్రీవంగా జరిగింది. ఈ కమిటీలో శ్రీసత్య సాయి జిల్లా తనకల్లు మండలం గంధోడు వారి పల్లికి చెందిన ఆరుద్ర శ్రీనివాసులును రాష్ట్ర ప్రదాన కార్యదర్శి గాను, మార్పు వాండ్ల పల్లికి చెందిన గంగులయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షులుగాను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం పెట్టి కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మేము ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి మా కర్తవ్యాన్ని నెరవేరుస్థామని వారు తెలిపారు. అలాగే రాష్ట్ర కమిటీలో కార్యవర్గ సభ్యులుగా పైపల్లి గంగాధర్, మూర్తి,సోదనపల్లి రామాంజినేయులును ఎన్నుకోవడం జరిగింది.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండల కేంద్రానికి చెందిన కె.రంగనాయకులు జూటూరు పెన్నానది నుండి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మంగళవారం సిఐ ఈరన్న వేములపాడు క్రాస్ వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ముద్దాయిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.



సీజ్ చేసి ఇసుక ట్రాక్టర్

